నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్స్‌ ఏఈ కిశోర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మసీద్‌బండ, సీఎంసీ లేఅవుట్‌, హ్యామ్లెట్‌ లేఅవుట్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

ఆల్విన్‌కాలనీలో.. విద్యుత్‌ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు విద్యుత్‌ ఏఈ ఎస్‌. రాఖేష్‌ కుమార్‌ గౌడ్‌ తెలిపారు. 11 కేవీ ఫీడర్‌ పరిధిలో.. ఆదివారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు మెరిడియన్‌ స్కూల్‌ ప్రాంతం, ఎస్‌ కన్వెన్షన్‌ లైన్‌, బుట్ట కన్వెన్షన్‌ రోడ్డు నుంచి ఎన్‌ఐఏ వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



చందానగర్‌ : చందానగర్‌ సర్కిల్‌ -21 పరిధిలో గంగారం- లింగంపల్లి వరకు జాతీయ రహదారి, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నాల్గవ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఉపకమిషనర్‌ మోహన్‌ రెడ్డి మాట్లాడుతూ రోడ్డుపై దుకాణాలు, డబ్బాలు ఉండకూడదని, తొలగించిన దుకాణాలు మరలా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టౌన్‌ప్లానింగ్‌ టీపీఎస్‌ శ్రీనివాస్‌ రెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌ పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించారు.

మైత్రీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఎల్లమ్మబండలో మైత్రీ కార్యాలయాన్ని శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవాలయాలు శక్తి కేంద్రాలు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌



ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ తదితరులు

మణికొండ: దేవాలయాలు శక్తి కేంద్రాలని, సందర్శించడం వల్ల శక్తి వస్తుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. గండిపేట మైసమ్మ ఆలయం ఆవరణలో పునః నిర్మాణం చేపట్టిన ముక్తేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట గండమ్మ, మైసమ్మ ఆలయంలో ఉన్న ప్రాచీన శివాలయాన్ని మాజీ కౌన్సిలర్‌ విజేత ప్రశాంత్‌యాదవ్‌ పునః నిర్మాణం చేయటం శుభపరిణామన్నారు.ఆలయంలో ఈనెల 13వ తేదీన ప్రారంభమైన ప్రతిష్ఠాపన పూజలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు కోటి దంపతులు, కాంగ్రెస్‌ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌ యాదవ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కె.వేణుగౌడ్‌, మాజీ వైస్‌ చైర్మన్‌ వెంకటేశ్‌యాదవ్‌, మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

ఎస్కీ డైరెక్టర్‌ డా.రామేశ్వరరావు



శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లను అందిస్తున్న డైరెక్టర్‌ రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా ద్వారా భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని 'ఎస్కీ' డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వర రావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్కీలో 'టెక్నాలజీ రిస్క్‌ మేనేజ్‌మెంట్‌'పై జాతీయ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీలో ప్రతియేటా సుమారు 350 వరకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. వృత్తి నైపుణ్యాలు మెరుగు పర్చుకోవడానికి శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, నిపుణులు, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తమ్మిడికుంట.. తగ్గిపోతోంది..

చెరువు పరిసరాల్లో రాళ్లు, మట్టితో పూడ్చివేత

- గుర్రపుడెక్కతో నిండిన చెరువు
- పక్కనే చెత్త డంపింగ్‌.. దుర్వాసన
- మందుబాబులకు అడ్డా.. పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



గుర్రపుడెక్కతో నిండిన తమ్మిడికుంట చెరువు

మాదాపూర్‌: ఐటీ ప్రాంతం.. మాదాపూర్‌ మెటల్‌ చార్మినార్‌ వద్ద ఉన్న తమ్మిడికుంట చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు రోజురోజుకు కుంచించుకుపోతోంది. చెరువు పక్కనే డంపింగ్‌ యార్డ్‌ను ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రధానరోడ్డు కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు చేస్తుంటారు. వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకుని వెళుతున్నారు. అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా, నిత్యం ఐటీ ఉద్యోగులతో రద్దీగా ఉండే ప్రాంతం ఇది. ఈ తమ్మిడికుంట చెరువును అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో దుస్థితికి చేరింది. పూర్తి స్థాయిలో చెరువు హద్దులను నిర్ణయించి కంచె వేయాలని కోరుతున్నారు. రాత్రి సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఇక్కడ వేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. చిరువ్యాపారులు సైతం వ్యర్థాలను అక్కడే పోస్తున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువు వద్ద పిచ్చి మొక్కలు పెరిగిన దృశ్యం



చెరువు పరిసరాల్లో రాళ్లు, మట్టిపోయడంతో కుంచించుకుపోతున్న దృశ్యం



చెరువు పక్కనే చెత్త డంపింగ్‌

ఘనంగా సంత్‌ సేవాలాల్‌ జయంతి

చందానగర్‌ : శ్రీ సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతిని పురస్కరించుకొని శనివారం మియాపూర్‌ నడిగడ్డ తండాలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జాతీయ షెడ్యూల్‌ ట్రైబ్‌ సభ్యులు జాటోతు హుస్సేన్‌, మియాపూర్‌ కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, డాక్టర్‌ రాంసింగ్‌, మోహన్‌సింగ్‌లు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ రంగారావు, నడిగడ్డ తండా అధ్యక్షులు అల్వార్‌ స్వామి నాయక్‌, తిరుపతి నాయక్‌, సీతారాం నాయక్‌, దశరథ్‌ నాయక్‌, గోపి నాయక్‌, రెడ్యా నాయక్‌, యూత్‌ అధ్యక్షులు దినేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పటాన్‌చెరు: బంజారాల ఆరాధ్య దైవం సంత్‌ శ్రీ సేవాలాల్‌ మహారాజ్‌ బోధనలు నేటి తరానికి అనుసరణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని బంజారాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించామని తెలిపారు. సొంత నిధులతో నియోజకవర్గ పరిధిలోని రాళ్లకత్వ తండా, ఐలాపూర్‌ తండా, వెలిమెల తండా, కొల్లూరు తండాలలో సేవాలాల్‌ ఆలయాలను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అమీనపూర్‌ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌ రెడ్డి, మండల విద్యాధికారులు పి.పి. రాథోడ్‌, నాగేశ్వర్‌ నాయక్‌, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, నాయకులు ఐలేష్‌ పాల్గొన్నారు.



మియాపూర్‌ నడిగడ్డ తండాలో ..



సేవాలాల్‌ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

రాకపోకలు ప్రమాదకరంగా..





శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి వద్ద పనులు జరుగుతున్న నేపథ్యంలో కార్లు, బస్సులను నల్లగండ్ల మీదుగా మళ్లించారు. కానీ ద్విచక్ర వాహనదారులు మాత్రం సమయం, పెట్రోల్‌ ఆదా అవుతుందనే భావనతో ఇలా ప్రయాణిస్తున్నారు. పనులు పూర్తయ్యే వరకు మళ్లింపు మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

- గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లితండాలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, జలమండలి మేనేజర్‌ అభిషేక్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లి తండాలో సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి తెలిపారు. శనివారం గోపన్‌పల్లి తండాలో జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో అన్ని కాలనీలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. పాత పైప్‌లైన్‌లను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో జలమండలి మేనేజర్‌ అభిషేక్‌రెడ్డి, నాయకులు హన్మంతునాయక్‌, శ్రీరామ్‌నాయక్‌, రాజునాయక్‌, రాణి, నర్సింగ్‌,ప్రకాశ్‌, నర్సింహ, సుమన్‌, రాజు, మోహన్‌రెడ్డి, శ్యామ్‌ రాథోడ్‌, శ్రీశైలం, కృష్ణ, నరేందర్‌, స్థానికులు పాల్గొన్నారు.

పీఎస్‌లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

గచ్చిబౌలి: శివరాంపల్లిలోని నేషనల్‌ పోలీస్‌ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ తీసుకుంటున్న ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం పలు పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్ల పనితీరును పరిశీలించారు. రిసెప్షన్‌, జనరల్‌ డైరీ, ఎఫ్‌ఐఆర్‌ నమోదు, లాకప్‌, రికార్డుల గురించి ఎస్‌హెచ్‌ఓలు యువ ఐపీఎస్‌లకు వివరించారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు పెట్రోల్‌ మొబైల్స్‌, బ్లూకోల్ట్స్‌, సెక్టార్‌ ఎస్‌ఐలు ఎలా స్పందిస్తారో అడిగి తెలుసుకున్నారు. సైబరాబాద్‌లోని 18 పోలీస్‌ స్టేషన్లను ట్రైనీ ఐపీఎస్‌లు సందర్శించినట్లు పోలీస్‌ అధికారులు తెలిపారు.

అమరవీరులకు ఘన నివాళి

రాయదుర్గం: పుల్వామా అమరులకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని కార్గిల్‌చౌక్‌లో నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి అఖిలభారత విద్యార్థి పరిషత్‌ ఆధ్వర్యంలో అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం





శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పూర్ణాభిషేకం, పూజలు చేశారు. అదే విధంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలను ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణాచార్యులు చేపట్టారు. వేడుకల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ మంజూరు పత్రం అందజేత



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌ : కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కి చెందిన సమీనా బేగంకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షలు మంజూరుపత్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్‌ యాదవ్‌, ఎండీ ఇబ్రహీం, పురంధర్‌రెడ్డి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



అనితాదేవి (ఫైల్‌)

చందానగర్‌ : వేర్వే రు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. మియాపూర్‌ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న అర్జున్‌కుమార్‌ కూతురు అనితాదేవి (48) ఎర్రగడ్డ మెంటల్‌ హాస్పటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ నెల 11వ తేదీ రాత్రి 8.00 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదన్నారు. 25 సంవత్సరాలుగా ఇలా బయటకు వెళ్ళి ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ దగ్గర అడుక్కుంటూ తిరిగి వస్తుందన్నారు. ఈ మేరకు మియాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. సెక్యూరిటీ గార్డు



సోను తివారి (ఫైల్‌)

గచ్చిబౌలి: బిహార్‌కు చెందిన సోను తివారి(45) సెక్యూరిటీ గార్డు అదృశ్యమయ్యాడు. గౌలిదొడ్డిలో నిర్మాణంలో ఉన్న ఓ సైట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. జనవరి 25న రాత్రి 9 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించినప్పటికీ అక్కడికి వెళ్లలేదు. ముంబైలో సెక్యూరిటీ గార్డుగా పని చేసే సోదరుడు అనిల్‌ తన అన్న ఆచూకీ తెలియడం లేదని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసుల దర్యాప్తులో ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. అదృశ్యమైన సోను తివారి వివరాలు తెలిస్తే 9490617127 ఫోన్‌ నెంబర్‌కు సమాచారం అందించాలని గచ్చిబౌలి ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి సూచించారు.

కనువిందు.. నృత్య ప్రదర్శన





మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం వైఎస్‌ కళ్యాణి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఇందులో శివాష్టకం, బాలగోపాల తరంగం తదితర అంశాలను ప్రదర్శించారు.అలాగే భువనేశ్వరీ బారక్‌ శిష్య బృందం నమశ్శివాయ, అన్నమాచార్యకీర్తన, వినాయకకౌతం తదితరాలను ప్రదర్శించారు. అవని, దీపాలి, అక్షర, రసజ్ఞ, నిత్యశ్రీ, దీక్షిత, శ్లోక, సహన, ఇసాన్వి, శ్రీహిత, తాన్విక, అక్షయ తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు డాక్టర్‌ వనజ, డాక్టర్‌ కిరణ్మయిలు కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్య పురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాలలో భాగంగా శనివారం హరిప్రియ సంకీర్తనార్చన చేశారు. పొడగంటిమయ్య మిమ్ము, వెంకటాచలనిలయం, ఇంతచక్కని పెండ్లికొడుకు, గోవిందాశ్రిత, అదివో అల్లదివో, భోశంభో కీర్తనలను ఆలపించారు. ఇందుశ్రీ, నమ్రత, శ్రీవైవి, సుదర్శన్‌, నవీన్‌, జైవిక్‌, సంతోష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్కులో బోరు పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు శనివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పడిగేశ్వరరావు, చెన్నారావు, రవీందర్‌ రావు తదితరులు పాల్గొన్నారు.

పగలూ, రాత్రి.. దోమల బాధ

రోగాలబారిన బస్తీ, కాలనీలవాసులు



ఆల్విన్‌కాలనీ, ధరణినగర్‌లోని ప్రకృతి నివాస్‌ అపార్టుమెంట్‌లో ఓ ఇంట్లో దోమల దండయాత్ర



దోమలకు ఆవాసంగా మారిన ఆల్విన్‌కాలనీలోని నాలా



గుర్రపుడెక్కతో నిండిన పరికి చెరువు

ఆల్విన్‌కాలనీ: దోమల బాధ భరించలేకపోతున్నామని బస్తీ, కాలనీలవాసులు వాపోతున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా దాడి చేస్తున్నాయని రోగాలబారిన పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ధరణినగర్‌, భూదేవిహిల్స్‌, తులసినగర్‌, శ్రీతులసినగర్‌, చక్రధర్‌ కాలనీ, ఎల్లమ్మ బండ, పీజేఆర్‌ నగర్‌, సాయినగర్‌, తదితర కాలనీలు, బస్తీల్లో జ్వరాలు ప్రబలాయి. దీంతో ఆసుపత్రి ఖర్చులు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోర్లు, కిటీకీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకున్నా దోమలు ఆగడంలేదన్నారు. పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, నాలాలు, డ్రైనేజీల్లో పూడిక తీయకపోవటం, పారిశుద్ధ్య లోపంతో దోమలు ప్రబలుతున్నాయని, జీహెచ్‌యంసి ఎంటమాలజి సిబ్బంది ఫాగింగ్‌, నివారణ మందును పిచికారి చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వైరవిహారం



దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతున్న దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నాం. పరిసరాల శుభ్రత, నాలాలో వ్యర్థాలు, చెరువుల్లో గుర్రపు డెక్కతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇళ్లల్లో దోమల దండు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ ఫాగింగ్‌ చేయాలి.

–ప్రసాద్‌, ధరణినగర్‌